క్లుప్తంగా

ఎమ్మెల్సీ సిపాయికి సత్కారం



తిరుపతి కల్చరల్: ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంను సోమవారం 44వ డివిజన్ కార్పొరేటర్ వి.నారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అంద జేసి శాలువాతో సత్కరించారు.

రోడ్ల విస్తరణకు సహకారం అభినందనీయం

తిరుపతి తుడా: రోడ్ల విస్తరణకు ప్రజలు స్వచ్ఛం దంగా ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం గంగమ్మ ఆలయ మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులను పరిశీలించారు. గ్రూప్స్ థియేటర్స్ అధినేత, మాజీ ఎమ్మెల్యే చదలవాడ కృష్ణమూర్తి స్వచ్ఛందంగా థియేటర్స్ ముందు భాగాన్ని అప్పగించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే భూమన ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గంగమ్మ గుడి మాస్టర్ ప్లాన్ రోడ్డు విస్తరణ అవశ్యకతను గుర్తించి ఆ ప్రాంత వాసులు సహకరించడంతోనే అభివృద్ధి సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉదయ్, వంశీ పాల్గొన్నారు.

అమిత్‌షా మాటలు ప్రజాస్వామ్య విరుద్ధం

తిరుపతి కల్చరల్: బీజేపీ అధికారంలోకి రాగానే ముస్లిం రిజర్వేషన్ల బిల్లు తీసేస్తామని కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షా ప్రకటించడం ప్రజాస్వామ్య విరుద్ధమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తెలిపారు. ఆయన సోమవారం వీడియో విడుదల చేశారు. హోమ్ మంత్రి మత తత్వాలు రెచ్చగొట్టేలా మాట్లాడడం దురదృష్టకరమన్నారు. గతంలో ప్రధాని మోదీ, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగత్ అన్ని మతాల్ని, కులాలను కలుపుకుని పోవాలని చెప్పారని గుర్తుచేశారు. అమిత్‌షా తక్షణం ముస్లింలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

జేసీకి స్పందన లోగో బహూకరణ



తిరుపతి అర్బన్: జేసీ బాలాజీకి సోమవారం వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు ఉదయగిరి రమేష్ స్పందన లోగోతో పాటు జ్ఞాపిక బహూకరించారు. అనంతరం చిన్నగొట్టిగల్లుకు చెందిన డాక్టర్ భవిత భూ సమస్యపై వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా వైఎస్సార్ సీపీ కార్యక్రమాల ఇన్‌చార్జి దాసు, వెంకటగిరి వైఎస్సార్ సీపీ నాయకులు సుబ్రమణ్యం, గాయాజ్ పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల అధ్యక్షుడిగా మునిబాలకుమార్



తిరుపతి తుడా : ఏపీ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా తిరుపతికి చెందిన పావులూరి మునిబాలకుమార్ ఎన్నికయ్యారు. ఈ మేరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య సోమవారం హైదరాబాద్‌లో నియామక పత్రం అందజేశారు. మునిబాలకుమార్ మాట్లాడుతూ బీసీ ఉద్యోగుల హక్కుల కోసం పోరాటం చేస్తానని చెప్పారు.

పోలీసులకు దొంగ అప్పగింత

చంద్రగిరి(తిరుపతి రూరల్): శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వెంకన్న ఆలయం వద్ద వాహనాల పార్కింగ్‌లో కారు అద్దాలు పగులగొట్టి విలువైన వస్తువులను చోరీ చేస్తూ సోమవారం కర్ణాటకకు చెందిన కారు డ్రైవర్ పట్టుబడ్డాడు. దావనగేరికి చెందిన కారు డ్రైవర్ వీరేష్ సోమవారం భక్తులను తీసుకుని కల్యాణ వెంకన్న ఆలయానికి వచ్చాడు. మరో కారు అద్దాలు పగులగొట్టి వస్తువులను చోరీ చేశాడు. గమనించిన ఏఆర్ ఎస్ఐ ఆనంద్, కానిస్టేబుల్ దామోదర్ రెడ్డి, టీటీడీ సెక్యూరిటీ నవీన్ కుమార్‌రెడ్డి అతన్ని చంద్రగిరి పోలీసులకు అప్పగించారు.

గంగ జాతరను ఘనంగా నిర్వహిద్దాం

- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పిలుపు

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ జాతరను మహోన్నతంగా నిర్వహిద్దామని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు. జాతర సందర్భంగా ప్రత్యేకంగా రూపొందించిన స్టిక్కర్లను ఆయన సోమవారం మేయర్ శిరీష, డెప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, భూమన అభినయరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఆటోలకు స్టిక్కర్లు అంటించి ప్రచారాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మే 10 నుంచి 16 వరకు భక్తుల జానపద వేషాలతో జాతర కోలాహలంగా జరుగుతుందన్నారు. గంగమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఈ ఏడు అత్యంత వైభవంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో తిరుపతి, పరిసర ప్రాంత ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

మహా కుంభాభిషేక పనులకు ఎమ్మెల్యే పూజలు

తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో మే 1 నుంచి 5వ తేదీ వరకు జరుగనున్న మహా కుంభాభిషేక మహోత్సవాల పనులకు సోమవారం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, డెప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, భూమన అభినయరెడ్డి కలిసి పూజలు చేశారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో యాగశాల నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో ఎం.మునిక్రిష్ణయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి, వెంకటేష్ రాయల్, తలారి రాజేంద్ర, మద్దాలి శేఖర్, నాదముని, లక్ష్మీ వెంకటేష్, గోవిందరెడ్డి, కార్పొరేటర్ నారాయణ పాల్గొన్నారు.



యాగశాల పనులకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, డెప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, భూమన అభినయరెడ్డి, ఆలయ చైర్మన్, ఈవో

సబ్‌వే విస్తరణ తక్షణ అవసరం

- శ్రీనివాసంలోకి ఇన్–అవుట్ మార్గాలు ఉండాలి
- ప్రస్తుత గేటు వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి తుడా : యాత్రికులు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతం నుంచి శ్రీనివాసంలోకి వచ్చేందుకు ఏర్పాటు చేసిన సబ్‌వేను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం మేయర్ శిరీష, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణతో కలిసి శ్రీనివాసం సముదాయాన్ని సందర్శించారు. ప్రమాదాలకు కేరాఫ్‌గా నిలిచిన శ్రీనివాసం మెయిన్ గేట్, యాత్రికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని కొత్తగా ఏర్పాటు చేయనున్న ఇన్–అవుట్ మార్గాలతోపాటు బస్టాండ్ నుంచి నేరుగా శ్రీనివాసం ప్రాంగణం లోపలికి సబ్‌వేను తీసుకువచ్చే మార్గాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీనివాస సేతు ఫ్రీ లెఫ్ట్ శ్రీనివాసం గేటు ముందు డౌన్ అవుతుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించినట్లు తెలిపారు. ఈ సమస్యను అధిగమించేందుకు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా శ్రీనివాసానికి నైరుతిన శ్రీనివాసంలోకి ప్రవేశ మార్గాన్ని, ఈశాన్యంలో డాక్టర్ వైఎస్సార్ మార్గ్ (డీబీఆర్ రోడ్డు)లోకి అవుట్ గేటు ఉండేలా ఇంజినీర్లు అంచనాకు వచ్చినట్లు చెప్పారు. దీనిపై కౌన్సిల్‌లో నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. టీటీడీ అధికారులు కూడా సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. ఇన్–అవుట్ మార్గాలు అందుబాటులోకి వస్తే యాత్రికులకు మరింత సౌకర్యవంతంగా, సురక్షితంగా ఉంటుందన్నారు. అలానే సబ్‌వేను రోడ్డుపై కాకుండా నేరుగా శ్రీనివాసం సముదాయం లోపలకు కొనసాగించేలా ప్రతిపాదించినట్లు చెప్పారు. యుద్ధప్రాతిపదికన ఈ పనులు చేపట్టేందుకు టీటీడీ చర్యలు చేపట్టనుందన్నారు. టీటీడీ, మున్సిపల్ ఇంజినీర్లు సంయుక్తంగా కౌన్సిల్ తీర్మానం మేరకు ఇన్–అవుట్ మార్గాల నిర్మాణంపై చర్చించారు. శ్రీనివాసం ప్లాన్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సీఈ నాగేశ్వరరావు, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, స్థానిక కార్పొరేటర్ పుల్లూరు అమరనాథరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు తిరుమలరెడ్డి, లోకేష్‌రాయల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



శ్రీనివాసం ఇన్, అవుట్ దారులపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

స్పందన సమస్యలకు సత్వర పరిష్కారం

తిరుపతి తుడా : స్పందన సమస్యలకు సత్వరం పరిష్కారం చూపాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత అధికారులను ఆదేశించారు. ఆమె సోమవారం స్పందన, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాలు చేపట్టారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుకూ తప్పనిసరిగా పరిష్కారం చూపాల్సిన బాధ్యత సంబంధిత అధికారిదేనన్నారు. నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. స్పందనకు 35, డయల్ యువర్ కమిషనర్‌కు 10 ఫిర్యాదులు అందాయి. చింతలచేను ముత్యాలమ్మగుడి వీధి, ఉప్పంగి హరిజనవాడ తాళ్లపాక అపార్ట్‌మెంట్ రోడ్డు ఆక్రమణలు, సత్యనారాయణపురం సంజీవయ్య నగర్‌లో తాగునీటి సమస్యపై ఫిర్యాదులు వచ్చాయి. ఎస్టీవీ నగర్‌లో తాగునీరు కలుషితమవుతోందని వచ్చిన ఫిర్యాదులపై కమిషనర్ స్పందిస్తూ తక్షణం స్పందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, రెవెన్యూ ఆఫీసర్ కెఎల్ వర్మ, ఎంఈ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ హరిత

మహేశ్వరికి డాక్టరేట్



తిరుపతి ఎడ్యుకేషన్ : పద్మావతి మహిళా యూనివర్సిటీ తెలుగు విభాగపు పరిశోధక విద్యార్థిని నందిభక్తుల మహేశ్వరి డాక్టరేట్ డిగ్రీ పట్టా అందుకున్నారు. ఆమె రిటైర్డ్ ప్రొఫెసర్ ఎం.విజయలక్ష్మి మార్గదర్శకత్వంలో అమెరికా తెలుగు కథానిక అనే అంశంపై పరిశోధన చేశారు.

భక్తి ఉద్యమంతో సంఘ సంస్కరణ

తిరుపతి కల్చరల్: భగవత్ రామానుజాచార్యులు భక్తి ఉద్యమంతో సమానత్వాన్ని బోధించి సమాజాన్ని సంస్కరించారని రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం ఆచార్యులు చక్రవర్తి రంగనాథన్ తెలిపారు. టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అన్నమాచార్య కళామందిరంలో నిర్వహిస్తున్న రామానుజాచార్యుల అవతారోత్సవాలు సోమవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా చక్రవర్తి రంగనాథన్ మాట్లాడుతూ రామానుజాచార్యులు వేదవ్యాసుల వారు రచించిన బ్రహ్మ సూత్రాలకు వ్యాఖ్యానం రాశారని తెలిపారు. శరణాగతికి మూలం నమ్మకమని, భగవంతునిపై అనన్యమైన ప్రేమను ప్రదర్శించగడమే భక్తి అని వివరించారు. కార్యక్రమంలో ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఏఈవో శ్రీరాములు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పురుషోత్తం పాల్గొన్నారు.

మేలు చేశారు.. మరువలేం

తిరుపతి మంగళం : అర్హతను బట్టి పథకాలు అందించి మేలు చేశారు.. మీ మేలు మరువలేం.. వచ్చే ఎన్నికల్లో జగనన్న రుణం తీర్చుకుంటామని ఎమ్మార్‌పల్లి ఎస్వీనగర్ ప్రజలు తెలిపారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి సోమవారం కార్పొరేటర్ ఈశ్వరి, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పడమటి కుమార్, సుబ్రమణ్యంతో కలిసి తిరుపతి 21వ డివిజన్‌లోని ఎస్వీనగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. జగనన్న అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, వారి సమస్యలను తెలుసుకున్నారు. జగనన్న అధికారంలో ఉంటే మరిన్ని సంక్షేమ పథకాలు అందుకుంటారన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకుని, వచ్చే ఎన్నికల్లో జగనన్నకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంకు డైరెక్టర్లు కడపగుంట అమరనాథ్‌రెడ్డి, మాకం చంద్రయ్య, నాయకులు అనీల్, బాషా, మనోహర్‌రెడ్డి, జయ, మునిబాబు, జీవన్, సద్దా బాబు పాల్గొన్నారు.



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

ప్రమీళమ్మకు నివాళి

పాకాల : మండలంలోని దామలచెరువు పంచాయతీ బందార్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బాబురెడ్డి తల్లి ప్రమీళ(55)కు వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నివాళులర్పిచారు. ఆమె అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన సోమవారం బందార్లపల్లికి చేరుకుని ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, పార్టీ ఇన్‌చార్జి నంగా బాబురెడ్డి, డివిజన్ అధ్యక్షుడు నంగా కపిలేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, ఇమ్రాన్, సురేష్, వినాయక, రమేష్, చంటి, హేమంత్, మురళి, గౌతమ్‌రెడ్డి పాల్గొన్నారు.



పూలమాల వేసి నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

రైతన్నలకు అన్నం పెట్టడం మా అదృష్టం

పాకాల : దేశానికి అన్నం పెట్టే రైతన్నలకు అన్నం పెట్టడం తమ అదృష్టమని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి తెలిపారు. స్థానిక వారపు సంతలో సోమవారం రైతులు, వ్యాపారులకు భోజనాలు పెట్టారు. ఆమె మాట్లాడుతూ సంతకు వచ్చే రైతులు, వ్యాపారులు భోజనం కోసం ఎదురు చూసే పరిస్థితి ఉండకూదన్న ఉద్దేశంతో ఎమ్మెల్యే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. అలాగే వారపు సంతలు, ప్రైవేట్ బస్టాండ్లలో రుసుము చెల్లించే అవసరం లేకుండా ఎమ్మెల్యే తన సొంత నిధులు వెచ్చించినట్టు తెలిపారు. ఆటో కార్మికుల కోసం స్టాండ్ నిర్మిస్తున్నట్లు తెలిపారు.



సంతలో భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే సతీమణి చెవిరెడ్డి లక్ష్మి

ఎస్వీయూ ఇంజినీరింగ్ విద్యార్థులకు నగదు బహుమతులు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల అన్ని బ్రాంచ్‌ల ఫైనలియర్ విద్యార్థులకు హైదరాబాద్ చాప్టర్ పూర్వ విద్యార్థులు సోమవారం మెరిట్ ప్రాతిపదికన నగదు బహుమతులు అందజేశారు. వర్సిటీ రిజిస్ట్రార్ మహమ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో రూ.1.45 లక్షలను మెరిట్ విద్యార్థులకు అందజేశారు.

రిజిస్ట్రార్ మాట్లాడుతూ వర్సిటీ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు తోడ్పాటు అందించడం ఆనందకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్‌వీఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.



నగదు బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఎస్వీయూ రిజిస్ట్రార్ తదితరులు

శరవేగంగా సీతమ్మ నగర్ మాస్టర్‌ప్లాన్ రోడ్డు పనులు

తిరుపతి తుడా : సీతమ్మనగర్ మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నట్టు డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం ఎమ్మార్‌పల్లి కూడలి–మహిళా యూనివర్సిటీ రోడ్డును అనుసంధానంచేసే సీతమ్మనగర్ మాస్టర్ ప్లాన్ రోడ్డును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డు ద్వారా మహిళా యూనివర్సిటీ రోడ్డు నుంచి ఎమ్మార్‌పల్లి కూడలికి సులభంగా చేరుకోవచ్చన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటమునిరెడ్డి, తిమ్మారెడ్డి, కుమార్, అనిల్‌రాయల్, చంద్ర, అమర్‌నాథ్‌రెడ్డి, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

సబ్‌వే అభివృద్ధికి చర్యలు

పాడుబడిన సబ్‌వేను అభివృద్ధి చేస్తామని మేయర్ శిరీష తెలిపారు. ఆమె సోమవారం డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డితో కలిసి సబ్‌వేను పరిశీలించారు. సబ్‌వేను శుభ్రం చేయించి పాదచారులకు భద్రత కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆకట్టుకున్న శంకర విజయం నృత్యరూపకం

తిరుపతి కల్చరల్: కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామి విజయ యాత్ర సందర్భంగా సోమవారం మహతి కళాక్షేత్రంలో ప్రదర్శించిన శంకర విజయం నృత్య రూపకం ఆకట్టుకుంది. ఈ రూపకాన్ని నెమ్మాని సీతారామమూర్తి రచించారు. ఎస్వీ శివకుమారి నృత్య దర్శకత్వంలో ఒంగోలుకు చెందిన నళినీ ప్రియ కూచిపూడి నృత్యనికేతన్ కళాకారులు ప్రదర్శన ఇచ్చారు. వారిని విజయేంద్ర సరస్వతి స్వామి ఆశీర్వదించారు. కళారూపాలు మన సంస్కృతిని ప్రజలకి మరింత చేరువ చేస్తాయని, పీఠం తరపున అవకాశం కల్పిస్తామని తెలిపారు. తిరుపతి బ్రాహ్మణ సమాజం ప్రతినిధులు కొత్తపల్లి అజయ్‌కుమార్, కేఆర్.వెంకటాచలం, జీఎల్.మనోహర్, భీమాస్ అశోక్, భీమాస్ బాలాజీ, వేదం శ్రీహరి, నృత్య సంస్థ ప్రతినిధులు ఎస్‌వీ శేషయ్య, వ్యోమజాల శ్రీనివాస్, ధార్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



శ్రీశంకర విజయం నృత్య రూపకంలోని దృశ్యం

భువనేశ్వరి ట్రేడ్ ఫైర్ ఎగ్జిబిషన్ ప్రారంభం

తిరుపతి కల్చరల్: డీబీఆర్ రోడ్డులో ఏర్పాటు చేసిన భువనేశ్వరి ట్రేడ్ ఫైర్ ఎగ్జిబిషన్‌ను సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిర్వాహకుడు శ్రీనివాస్ కొన్నేళ్లుగా తిరుపతిలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి స్థానికులకు ఆనందం కలిగిస్తున్నారని తెలిపారు. వేసవి విడిదిగా సరికొత్తగా ఫారిన్ సిటీలను దర్శించే అనుభూతితో ఏర్పాటు చేసిన ఫారిన్ సిటీ ఎగ్జిబిషన్‌ను ప్రజలందరూ తిలకించి ఆనందాన్ని ఆస్వాదించాలని కోరారు. ఎగ్జిబిషన్ నిర్వాహకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ఏడాది రూ.60 లక్షలతో వైవిధ్య భరితమైన లండన్ బ్రిడ్జి, యూనివర్శల్ వంటి అద్భుతమైన కట్టడాలతో కూడిన ఫారిన్ సిటీ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం రామారావు, దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, కార్పొరేటర్లు అమరనాథ్‌రెడ్డి, మునిరామరెడ్డి పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష, నిర్వాహకుడు శ్రీనివాస్

జగనన్న పాలనలోనే దళితుల అభ్యున్నతి



తిరుపతి మంగళం : వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాకే దళితులకు ఉన్నత స్థానం లభించిందని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు నల్లాని బాబు తెలిపారు. తాడేపల్లిలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలతో ఎక్కడికి వెళ్లినా ఆదరణ లభిస్తోందన్నారు. దళితులను అణగతొక్కడమే చంద్రబాబు చరిత్ర అని ఆరోపించారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా జగనన్నను గెలిపించుకునేందుకు దళితులమంతా సిద్ధంగా ఉన్నట్టు నల్లాని బాబు చెప్పారు.

డ్రాగన్ బోట్ ఇండియా స్పోర్ట్స్ టీం ఎంపిక

తిరుపతి కల్చరల్: డ్రాగన్ బోట్ ఇండియా స్పోర్ట్స్ టీంను ఎంపిక చేసినట్టు తిరుపతి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.ప్రవీణ్ తెలిపారు. పదవ నేషనల్ డ్రాగన్ బోట్ ఇండియా అండ్ ట్రెడిషనల్ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ –2022–23కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ టీం సెలక్షన్ సోమవారం శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించామని తెలిపారు. క్రీడాకారులు బి.ఉమశ్రీ, బికే.లావణ్య, జి.లలిత, న్యూ జాహ్నవి, ఓ.లలిత, పి.దివ్యశృతి, బి.లహరి, బి.హేమ, ఎస్.హిందూ, బి.నాగలక్ష్మి, ప్రియా, కె.కావ్య, వి.నేత్రయూ ఎంపికయ్యారు. వీరు ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు బీహార్‌లో జరగనున్న జాతీయ క్రీడల్లో పాల్గొంటారు. అక్కడ గెలుపొందిన క్రీడాకారులు చైనాలో జరుగబోయే 19వ ఏషియన్ గేమ్స్‌లో పాల్గొంటారు. సెట్విన్ సీఈవో వి.మురళీకృష్ణ మాట్లాడుతూ మొట్టమొదటిగా డ్రాగన్ బోట్ బాలికల టీం పతకాలు సాధిస్తుందని ఆకాంక్షించారు.



ఎంపికైన క్రీడాకారులతో ప్రవీణ్

టీడీపీ నేతలు మా శ్మశానాన్ని ఆక్రమిస్తున్నారు

తిరుపతి అర్బన్: టీడీపీ నేతలు మా శ్మశానాన్ని ఆక్రమిస్తున్నారని తిమ్మినాయుడు పాళెం ఎస్సీ కాలనీ వాసులు ఆరోపించారు. వారు సోమవారం తిరుపతి అర్బన్ తహసీల్దార్ వెంకటరమణకు ఫిర్యాదు చేశారు. స్థలం ఆక్రమణకు గురికాకుండా ప్రహరీ గోడ నిర్మించాలని కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో అనీల్‌కుమార్, కుప్పయ్య, బొజ్జయ్య, రవి, యువరాజ్, పార్థసారథి, చెంగల్రాయల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎస్సీ కాలనీవాసులు

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

పాకాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన పంచాయతీ కార్యదర్శులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్‌బాబు పాల్గొన్నారు.

తనపల్లి సచివాలయంలో ..

తిరుపతి ఎడ్యుకేషన్ : పద్మావతి మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్–3 విద్యార్థులు సోమవారం తిరుపతి రూరల్ మండలం తనపల్లి సచివాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి మురళీ మాట్లాడుతూ స్థానిక సంస్థల ద్వారానే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పి.నీరజ మాట్లాడుతూ స్వచ్ఛమైన నీటి లభ్యత, మంచి ఆరోగ్య పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సుస్థిరమైన అభివృద్ధిని సాధించవచ్చన్నారు.

పేదరిక నిర్మూలనకు కృషి

భాకరాపేట: పేదరిక రహిత సమాజాన్ని స్థాపిద్దామని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ యుగంధర్‌రెడ్డి అన్నారు. ప్రపంచ జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ రాజ్ సంస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్యకర, పరిశుభ్రమైన, హరిత, మహిళా స్నేహపూర్వక గ్రామాలను తయారు చేద్దామని పిలుపునిచ్చారు. సీడీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, ఎంపీడీవో దేవేంద్రబాబు, ఈవోపీఆర్‌డీ మదనమోహనరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని 13 పంచాయతీ కార్యాలయాల్లో పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని సర్పంచుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

గ్రామాభివృద్ధికి కృషి చేద్దాం

రామచంద్రాపురం: గ్రామాభివృద్ధికి కృషి చేద్దామని ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ మహ్మద్ రఫీ ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 9 అంశాలలో ప్రతిభ కనబరచిన పంచాయతీలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ దేవిక, ఎంపీటీసీలు చంద్రశేఖర్‌రెడ్డి, ఎద్దల రాజేష్, మంజుల సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షాదీ మహల్ నిర్మాణానికి నిధుల మంజూరు

భాకరాపేట: చిన్నగొట్టిగల్లులో షాదీ మహల్ నిర్మాణానికి రూ.40 లక్షలు కేటాయించినట్లు పంచాయ తీ రాజ్ డీఈ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం షాదీ మహల్‌ను పరిశీలించారు. త్వరలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. డివిజన్ పార్టీ అధ్యక్షుడు అక్బర్, ఇర్షాద్ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి వాటర్ కూలర్ వితరణ

తిరుపతి అర్బన్: తిరుపతి గోవిందరాజులస్వామి ఆలయం సమీపంలోని గ్రంథాలయానికి శాశ్వత సభ్యత్వం కలిగిన ఎన్ఎస్ రవి వాటర్ కూలర్ వితరణ చేశారు.

నేడు అవగాహన సదస్సు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఎస్వీయూ వృక్ష శాస్త్ర విభాగంలో మంగళవారం రోల్ ఆఫ్ మిల్లెట్స్ ఇన్ కాంటెంపరరీ లైఫ్ స్టైల్ – హెల్త్ అండ్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. పోస్టర్‌ను సోమవారం వీసీ రాజారెడ్డి, రిజిస్ట్రార్ మహమ్మద్ హుస్సేన్, ఎస్వీయూ ఉమెన్ ఎంపవర్మెంట్ డీన్ సావిత్రమ్మ ఆవిష్కరించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



నటి వేదిక

తిరుమల: శ్రీవారిని సోమవారం తెలంగాణ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, ఎమ్మెల్సీలు కళ్యాణ్ చక్రవర్తి, రమేష్‌యాదవ్, సినీ నటి వేదిక దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

పీహెచ్‌సీ తనిఖీ

పాకాల : స్థానిక పీహెచ్‌సీని జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి సోమవారం తనిఖీ చేశారు. రోగులకు అందజేస్తున్న సేవలపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. సర్పంచ్ కస్తూరి, నితిన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామీణ పేదల సంఘం సభలు

తిరుపతి కల్చరల్: తిరుపతిలో మంగళ, బుధవారాల్లో గ్రామీణ పేదల సంఘం 6వ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పట్నాయక్, వెంకటేశ్వరరావు తెలిపారు. వారు సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు.

వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టండి

తిరుపతి అర్బన్: సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. ఆయన సోమవారం వైద్యాధికారులతో కలిసి మలేరియా వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల పోస్టర్‌ను ఆవిష్కరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలి

భాకరాపేట : ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలని ఏపీఎం కుమార్ పేర్కొన్నారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో సోమవారం సంఘమిత్రలతో సమావేశమయ్యారు. ఎంపీపీ యుగంధర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు పొదుపు చేయడం ద్వారా పిల్లలు ఉన్నత చదువులు చదివేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.